క్లుప్తంగా

పాకాకు గౌడ సంఘీయుల అభినందన



సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రాజ్యసభ సభ్యుడిగా ధ్రువీకరణ పత్రం స్వీకరించిన పాకా సత్యనారాయణను ఏలూరు గౌడ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. భీమవరంలోని ఆయన స్వగృహం వద్ద కలిసిన గౌడ సంఘీయులు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు ఉప్పాల జగదీష్ బాబు, సూరి బాబు, వీరంకి పాండు, వీరమల్లు వెంకట సత్యనారాయణ, మొదుగుమూడి శివ రామకృష్ణ, మార్గాని రామ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ సంబరాలు పోస్టర్ విడుదల



తెలుగు సాహితీ సంబరాలు పోస్టర్‌ను విడుదల చేసిన డీఈఓ వెంకట లక్ష్మమ్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 10, 11 తేదీల్లో ఏలూరు మహలక్ష్మీ గోపాలస్వామి కల్యాణ మండపం వేదికగా శ్రీశ్రీ కళావేదిక సంస్థ వ్యవస్థాపక సీఈఓ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల కార్యక్రమాలు విజయవంతం కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ ఆకాంక్షించారు. సంబరాల వాల్ పోస్టర్‌ను సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్, డీఈఓ కార్యాలయంలో డీఈఓ విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరికోటి, ఉపాధ్యక్షుడు శొంఠియాల కస్తూరి రావు, కో-కన్వీనర్ ఎంజే సుజయ్ కృష్ణ, శ్యామల హరికోటి, పురం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ అప్తమాలిక్ ఆఫీసర్‌గా దివ్య

దెందులూరు: మండలంలోని సీహెచ్‌సీ అప్తమాలిక్ (కంటి వైద్యం) ఆఫీసర్‌గా దివ్య నియమితులయ్యారు. సోమవారం సీహెచ్‌సీ సూపర్‌ండెంట్ సుందర్ కుమార్ మాట్లాడుతూ దివ్య దెందులూరు సీహెచ్‌సీలో సోమ, మంగళ, బుధవారాల్లో, గురు, శుక్ర, శనివారాల్లో పోతునూరు పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తారని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

టిడ్కో ఇళ్లపై స్పందించని ప్రభుత్వం



పోణంగి రోడ్డులో ఉన్న టిడ్కో నిర్మాణాలు



టిడ్కో నిర్మాణాలు

- 10 నెలలైనా అమలు కాని ఎన్నికల హామీ
- లబ్ధిదారుల ఆవేదన
- పనికిరాకుండాపోతున్న నిర్మాణాలు
- రూ.50 వేలు చొప్పన చెల్లించి ఎనిమిదేళ్లు

ఏలూరు (టూటౌన్): టిడ్కో ఇళ్ల కోసం పేదలు ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లు పంపిణీ చేసేస్తామంటూ కూటమి నాయకులు ఉత్తర ప్రగల్భాలు పలికారు. అధికారం చేపట్టి 10 నెలలు దాటినా దాన్ని ఆ హామీ నెరవేర్చకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసే పనులకు చెప్పే వాటికి వాస్తవ పరిస్థితులు చాలా దూరంగా ఉన్నాయంటూ టిడ్కో లబ్ధిదారులు దుమ్మెత్తి పోస్తున్నారు. పేదల పట్ల కూటమి ప్రభుత్వానికి ఎటువంటి చిత్తశుద్ధి లేదంటూ విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలి, లేకుంటే అవి నిరుపయోగంగా మారతాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

2,208 మంది గుర్తింపు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో టిడ్కో ఇళ్లకు 2018లో మొత్తం 6,480 మంది ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. వీటి పరిశీలన అనంతరం 4,272 మందిని అనర్హులుగా తేల్చారు. మిగిలిన 2,208 మందిని అర్హులుగా గుర్తించారు. ఈ క్రమంలో ఏలూరు నగరంలోని ఆయా డివిజన్లలోని కార్పొరేటర్లు తమ చేతి వాటాన్ని ప్రదర్శించారు. తమకు తాయిలాలు ఇచ్చిన వారికే టిడ్కో ఇల్లు కేటాయించేలా చక్రం తిప్పారనే విమర్శలూ ఉన్నాయి. ఎంపికైన వారు తమ వాటా సొమ్ముగా రూ.50 వేలు చొప్పున చెల్లించారు. బ్యాంకు వడ్డీ లెక్క కట్టినా తాము చెల్లించిన మొత్తం రెట్టింపయ్యేదని, నేటికీ తమకు ఇళ్లు స్వాధీనం చేయలేదని లబ్ధిదారులు మండి పడుతున్నారు.

60 ఎకరాల స్థలంలో నిర్మాణం

ఏలూరు నగరపాలక సంస్థలో గుర్తించిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి పోణంగి రోడ్డులో 60 ఎకరాల భూమిని సేకరించారు. ఆ ప్రాంతంలో ఒక్కో బ్లాకుకు 48 ఫ్లాట్లు చొప్పున మొత్తం 100 బ్లాకులులో 4,800 ఫ్లాట్లు నిర్మించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి విడతలో గుర్తించిన అర్హులకు 40 బ్లాకుల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో ఇప్పటి వరకు 20 ఫ్లాట్లు మాత్రమే నివాసయోగ్యంగా నిర్మించారు. మరో 20 ఫ్లాట్లు 80 శాతం మేర పూర్తి చేశారు. మిగతా వన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. వీటి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి



కూటమి ప్రభుత్వం టిడ్కో ఇండ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలి. పూర్తయిన ప్లాట్లను తక్షణం లబ్ధిదారులకు అప్పగించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీపై టీడీపీ కూటమి నేతలు అధికారం చేపట్టి 10 నెలల దాటినా నోరు మెదపకపోవడం దారుణం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు చేయాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి, ఏలూరు

ఇళ్లను వెంటనే అప్పగించాలి



లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను తక్షణం అప్పగించాలి. ఎన్నో ఏళ్ల నుంచి ఏలూరు నగరంలోని వేల మంది లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది, వెంటనే ఇళ్లను తమకు అందజేస్తారని భావించిన పేదలకు నిరాశే ఎదురైంది. ఇప్పటికైనా లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ, ఏలూరు

శ్రీవారికి హంస వాహన సేవ



శ్రీవారికి హంస వాహన సేవ చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి 36వ నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్ఠా మహా కుంభాభిషేకాల్లో భాగంగా సోమవారం స్వామివారికి హంసవాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి ధన్వంతరీ హవనం, అనంతరం నిత్య పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి శాత్తుమురై నిర్వహించి తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీ వారికి హంసవాహన సేవ చేసి, నీరాజన మంత్రపుష్పా లు, శాత్తుమురై సమర్పించి తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో యాజ్ఞిక బ్రహ్మలు జీపీవీ దీక్షిత్ స్వామి, కిళాంబి వేంకట పవన్ కృష్ణమాచార్యులు పూజలు చేయ గా, ఈఓ సతీష్ కుమార్ నల్లూరి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వేసవి విజ్ఞాన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు



దెందులూరు : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, చెడు స్నేహాల కారణంగా చెడ్డ ఫలితాలను చవిచూడాల్సి వస్తుందని రిసోర్స్‌పర్సన్ పి.సంతోషకుమారి హితవుపలికారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సోమవారం ఏడో రోజు వినోదాత్మకంగా నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్ బాబు పర్యవేక్షించారు. గ్రంథాలయ సిబ్బంది బీవీఎస్ లక్ష్మి విద్యార్థులకు ఓంకారం నినాదంతో యోగా చేయించారు. ఈ సందర్భంగా రెండు నీతి కథలను (తోడేలు – కోతి) చిన్నపిట్ట – చిన్నప్రయత్నం – పెద్ద ఫలితం బోధించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధులు, దేశ నాయకుల జీవిత చరిత్రలను వివరించారు. యోగాలో ఒక భాగంగా బ్రెయిన్ జిమ్ చేయించారు. రిసోర్స్ పర్సన్, డ్రాయింగ్ టీచర్ పి.శంకర్ చిత్రలేఖనంలో మెళకువలపై శిక్షణ ఇచ్చారు. నృత్య కళాకారుడు వై.ఫణికాంత్ విద్యార్థులకు నృత్యాలపై శిక్షణ కొనసాగించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాం పాషా తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

దెందులూరు: విద్యార్థులు పోటీతత్వం, కష్టపడే మనస్తత్వం కలిగి ఉండాలని చాటపర్రు గ్రంథాలయం అధికారి వై.వాసుకి అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను జూనియర్ సీనియర్ విభాగాల్లో నిర్వహించారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి



పేపర్ క్రాఫ్ట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచడానికి రకరకాల అంశాలతో కూడిన హేలాపురి సమ్మర్ క్యాంపు అందరూ వినియోగించుకోవాలని పలువురు కోరారు. ఆదివారపు పేట ఏఆర్‌డీజీకే మునిసిపల్ హై స్కూల్‌లో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న పది రోజులు సమ్మర్ క్యాంపులో సోమవారం కాగితాలతో బొమ్మలు చేయడం, బియ్యం గింజలపై అక్షరాలు రాయడం, కరాటే శిక్షణ, ఆహార నియమాలు గురించి వివరించారు. పేపర్ క్రాఫ్ట్స్ గురించి డ్రాయింగ్ టీచర్ పీఎల్ నాగేశ్వరరావు నేర్పారు. సరదా సరదా గణితం, తేలిగ్గా తెలుగు గురించిన కొన్ని మెలకువలు తెలుగు, గణిత నిపుణులు వై.ఆనంద నాయుడు పరిచయం చేశారు. మైక్రో ఆర్ట్స్‌పై ఆసక్తి కలిగించే విషయాలు, బియ్యం గింజపై 108 అక్షరాలు రాసిన ఐఎంజీ అవార్డు గ్రహీత దొర శివప్రసాద్ వివరించారు. ఆత్మ రక్షణ కోసం శరీర దృఢత్వం కోసం నేర్చే కరాటే గురించి కరాటే మాస్టర్ జి.ప్రసాద్ తెలిపారు. వేసవిలో పిల్లలు, పెద్దలు అందరూ రైతులు పండించే పండ్ల రసాలు, సహజ పానీయాలు తాగాలని, కూల్ డ్రింకులు ద్వారా వచ్చే నష్టాలు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు వివరించారు. కార్యక్రమాన్ని యాదాద్రి బాలోత్సవం సోషల్ సెంటర్స్ సూపర్‌వైజర్ కె.జనని సమన్వయం చేశారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

దెందులూరు: కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. సోమవారం పైడిచింతపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల కులగణన లేకపోవడం వల్ల బహుజనుల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో న్యాయం జరగలేదని అన్నారు. కులం సామాజిక, సాంస్కృతిక, తాత్విక జీవన వ్యవస్థల నుంచి ఆయా కాలాల్లో పరిణామం చెందుతూ వచ్చి కుల నిర్మూలన దశకు చేరుకుందని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావించారని తెలిపారు. కులగణనే కాక ఆర్థిక గణన కూడా చేయగలిగితే దేశ సామాజిక ఆర్థిక పరమైన నిజమైన స్వరూపం బయటకొస్తుందని చెప్పారు. కుల గణన ఈ నిర్ణయంతో పుణాత్మకమైన మార్పు రావడం ఖాయమన్నారు. ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పల్లెం ప్రసాద్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేర ఆనంద్ మాట్లాడుతూ బీసీలు, దళితుల్లో ఆర్థిక సామాజిక రాజకీయ చైతన్యం పెరుగుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. కులగడం నిర్ణయాన్ని బీసీలు, ఎస్సీలు, మైనారిటీలన్నీ స్వాగతిస్తున్నామని తెలిపారు.

కులగణనపై సానుకూలత హర్షణీయం

ఏలూరు (టూటౌన్): కుల గణనపై కేంద్ర చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి లక్కోజు అనిల్ ఆచార్య హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే జాతీయ జనాభా లెక్కల్లో కుల గణనను చేర్చాలనే ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న మైలురాయి నిర్ణయాన్ని ఓబీసీ మోర్చా స్వాగతిస్తున్నట్టు తెలిపారు. 94 సంవత్సరాల తర్వాత ఈ ప్రక్రియను పునరుద్ధరించాలనే మోదీ ప్రభుత్వ నిర్ణయం పారదర్శకత, నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. 2010లో యూపీఏ హయాంలో, కుల గణనను పరిగణనలోకి తీసుకోవడానికి మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి, పారదర్శక గణన కాకుండా సర్వేను మాత్రమే నిర్వహించాలని ఎంచుకుని సమాజాన్ని మోసం చేసిందని ఆరోపించారు. సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ) నుంచి వచ్చిన డేటా ఎప్పుడూ పూర్తిగా విడుదల కాలేదని తెలిపారు. కులగణనతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని అనిల్ ఆచార్య ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	38	బీన్సచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	30-36	బీట్‌రూట్	34
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	22	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	18
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు - తిరుపతి	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	22
ఏలూరు -జీడీమెట్ల (ఖమ్మం)	20.15	4802	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులను నియమించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి పాఠశాలకూ కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ఎలిమెంటరీ పాఠశాలలను యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం ఏలూరు తాహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఏలూరు జోన్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఎలిమెంటరీ పాఠశాలలకు పూర్వ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలని, ప్రతి పాఠశాలలోనూ తెలుగు మీడియంను సమాంతరంగా కొనసాగించాలని, ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా చర్యలు తీసుకోవాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈలోపు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలను ప్రకటించాలని తదితర డిమాండ్ల సాధనకు ధర్నా చేశామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు డీకేఎస్ఎస్ ప్రకాష్ రావు, నిడమర్రు మండల ప్రధాన కార్యదర్శి ఎం కొండయ్య, పెదవేగి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కృష్ణారావు, బాలాంజనేయులు, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే. ఆనంద్, అబ్బు దాసరి శ్రీనివాస్, ఏలూరు రూరల్ ప్రధాన కార్యదర్శి తేళ్లూరి శ్రీనివాస్, నగర మాజీ అధ్యక్షుడు డి.కేదారేశ్వర స్వామి, నగర శాఖ ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కేపీఆర్ జేఎల్ సిద్దార్థ హైస్కూల్‌కు అవార్డు



లీడ్ శిక్ష అవార్డు అందుకుంటున్న సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ సురేష్ బాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన కేపీఆర్ జేఎల్ సిద్ధార్థ హైస్కూల్ విద్యారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా లీడ్ శిక్ష అవార్డు అందుకుంది. ఈ అవార్డును హైదరాబాద్ మాదాపూర్‌లోని లే మెరిడియన్‌లో జరిగిన ఫంక్షన్‌లో ప్రతిష్ఠాత్మక సౌత్ జోనల్ విజేతగా విద్యాసంస్థ తరుపున చైర్మన్ కోనేరు సురేష్ బాబు, ప్రిన్సిపాల్ పరాంకుశం కుమార్‌లు లీడ్ సీఈఓ సుమీత్ మెహతా, దీపక్ హరిహరన్ ద్వారా అందుకున్నారు. ఈ మేరకు సురేష్ బాబు ఏలూరులో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లీడ్ సలహాదారు బీవీ సుధాకర్ తమ పాఠశాల శ్రేష్ఠత, నిబద్ధతలను వివరించారని పేర్కొన్నారు. ఈ గుర్తింపు విద్య పట్ల తమ అంకితభావాన్ని, లీడ్ పాఠ్యాంశాల ప్రభావాన్ని హైలైట్ చేసిందని వివరించారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు.

ఆర్టీసీలో సమస్యలను పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: ఏపీఎస్ ఆర్టీసీలో ఉన్న అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో సెక్రటరీ డీవీఎస్ఎన్‌టీ రాజు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ 5వ దశ ఆందోళనలో భాగంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కె.స్లీవజోజికి ఆర్టీసీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న 38 డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోవడంతో దశల వారీ నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

భీమడోలు: దివ్యాంగులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఏలూరు ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి అన్నారు. గుండుగొలనులోని విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 66 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ సోమవారం నిర్వహించారు. దాతలు వెలివెల రాంబాబు, సాంబశివరావు, హరికృష్ణ ది వ్యాంగులకు బియ్యం, పౌష్టికాహారాన్ని అందజేశారు.

రూ.50 వేలు పరిహారం చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారాన్ని తక్షణం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. అకాల వర్షాల వల్ల ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాలో అనేక చోట్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి, జీడి మామిడి, అరటి, మొక్కజొన్న, కూరగాయలు, పొగాకు తదితర పంటలకు కూడా నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన రైతులను తక్షణం పంటల బీమా పథకాన్ని అమలు చేసి పరిహారం చెల్లించాలని కోరారు. పిడుగుపాటుకు ఏలూరు జిల్లాలో ఇద్దరు వ్యక్తులు మరణించారని, వారి కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాయితీపై పశువుల దాణా

దెందులూరు: మండలంలో తెల్లరేషన్ కార్డు కలిగిన పశువుల పెంపకందారులకు 50 శాతం రాయితీతో పోషకాలతో కూడిన దాణా అందజేస్తున్నట్లు మండలం పశువైద్య శాఖ అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. సోమవారం కొవ్వలి పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా రెండు పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకు 450 కేజీల దాణాలు పంపిణీ చేస్తామన్నారు. పశుగ్రాసం కొరతను అధిగమించే అందుకే ఈ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.